# మసక

**"సుజాతా! పిల్లలు జాగ్రత్త. వాళ్ళకి కాఫీలూ, అవీ అలవాటు చెయ్యకు, మాల్టోవా ఇయ్యి రెండుపూటలా. వాళ్ళ ఒంటి కేమొచ్చినా అశ్రద్ధ చెయ్యకుండా వెంటనే డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళి చూపించు."**

"అలాగేలెండి. అయినా వాళ్లు మరీ అంత చిన్న పిల్లలైనట్టుగా మాట్లాడతారే? వాళ్లకేమైనా వస్తే వాళ్ళంతట వాళ్ళే డాక్టరు దగ్గరకి వెళ్ళి చూపించుకోగలరు లెండి!"

"నిజమే ననుకో. అన్నట్టు వాటరు ఫిల్టరు కడిగి శుభ్రం చేస్తూండు. వాళ్ళకి పాన్‌మసాలాలు తినొద్దని చెప్పు. అలాంటివన్నీ టి.వి.లో చూసి ఆనందించడానికేగాని వంటికి మంచివి కావని చెప్పు. మరొక విషయం సురేష్‌నీ, రమేష్‌నీ బాగా చదువుకోమని చెప్పు. టి.వి.లో ప్రోగ్రామ్స్ చూస్తూ కూర్చుంటే చదువు సాగదని చెప్పు. ఎలాగోలా పాసవడం కాదు కావల్సింది. ఫస్టుక్లాసు మార్కులతో పాసయితేనే దేనికైనా పనికొస్తారు. లేకపోతే ఎందుకూ పనికిరారు!"

"చెప్పడం తేలికే. ఈ ఒక్కప్రోగ్రామ్ చూస్తాం అంటూ కూర్చుంటారు. తీరా కూర్చున్నాక ఆ తరువాతది... ఆ తరువాతది... ఇదొక్కటే అంటూ చూసేస్తారు. పోనీ టి.వి. బంద్ చేద్దామంటే వాడి ఫ్రెండ్స్, వీడి ఫ్రెండ్స్ అందరూ హాలునిండా ఉంటే మధ్యలోకెళ్లి నేను బంద్‌చేస్తే బాగుంటుందా? చస్తున్నాను. ఈ టి.వి. కాదుగాని" విసుగ్గా అంది సుజాత.

"ఆ ఫ్రెండ్స్‌ని తగ్గించుకోమని చెప్పు." నవ్వుతూ అన్నాడు రామారావు.

"అంతేకాని మరో మాట అనరు. ఆ టి.వి. ఉండడం నించే వాళ్లటైమ్, నా టైమ్ కూడా వేస్టు అయిపోతోంది. శుభ్రంగా టి.వి. అమ్మేయండి. సమస్య తీరిపోతుంది" కోపంగా అంది సుజాత.

"అలా అనకపోతే పిల్లల్ని టి.వి. చూడకుండా కంట్రోల్ చెయ్యకూడదూ?"

"మీతో వాదించలేను బాబూ! వాళ్ళు నామాట వినకుండా ఉన్నారు."

"అదేమిటి, అలా అంటే ఎలాగ? వాళ్లకి చెప్పవలసిన రీతిలో మంచిగా చెప్పి చూడు. ఏమిటో నేను ఆఊరు వెళ్తున్నానన్నమాటేగాని నా మనసంతా మీమీదే ఉంటుంది."

"నేనూ అంతే! ప్రతి నిముషం మిమ్మల్నే తల్చుకుంటూ ఉంటాను. వేళకి సరిగ్గా తింటున్నారో లేదో, ఎలా ఉన్నారో ఏమిటోనని! ఎన్నాళ్ళండీ ఇలా అక్కడ మీరు, ఇక్కడ మేమూను? నాకు చాలా విసుగొస్తోంది."

"నాకు మాత్రం ఇబ్బంది కాదూ? నిన్నూ, పిల్లల్నీ వదిలి అంత దూరం వెళ్ళడం. ఇహ వెళ్ళిందగ్గర్నుంచీ ఇంటి ధ్యాస. ఏం చేస్తాం? సంవత్సరం మధ్యలో బదిలీ. వాళ్ళకి అక్కడ అప్లయి చేసినా సీట్లు దొరకలేదు, మరి! ట్రాన్స్‌ఫర్ కేస్‌లో కూడా మెరిట్‌ని బట్టే ఇస్తున్నారు సీట్లు! వాళ్ల ఏన్యువల్ పరీక్షలు అయిపోనీ. అక్కడ ఒక ఇల్లు చూసి మిమ్మల్ని తీసుకెళ్ళిపోతాను. అందాకా మనం కొంచెం ఇబ్బంది పడాలి. ఏం చేస్తాం? అన్నట్టు, పిల్లలేరీ?"

"అవతల ఉండి ఉంటారు. పిలుస్తాను?"

"వద్దులే."

సుజాత మనసు చివుక్కు మంది. ఆయన ఊరికి వెళ్తున్నారన్న జ్ఞానం లేదా. పిల్లలకి! ఆయన వెంట వెంటే వాళ్ళు తిరుగుతూ "నాన్నా! మళ్ళీ ఎప్పుడొస్తారు? వేగం వచ్చేయండి" అంటే ఎంత బాగుంటుంది! ఏమిటో ఈ కాలంపిల్లలకి సరదాలు- సంతోషాలు ఉంటే చాలు. మరేమీ అక్కర్లేదు. ఆప్యాయత-అనురాగం అభిమానం లాంటి పదాలు తను వల్లిస్తే వాళ్లు విడ్డూరంగా చూస్తారు, వింత జంతువుని చూసినట్టు -నిట్టూర్చింది ఆమె.

"సురేష్! నాన్నగారి కళ్లజోడు ఎక్కడుందో చూసిపెట్టు. నేను వెతికేను. నాకు కనబడలేదు." అప్పుడే హడావుడిగా లోపలికి వచ్చిన పెద్ద కొడుకుతో అంది సుజాత.

"అబ్బ. నాకేం తెలుసమ్మా? అక్కడే ఉంటుంది. చూసుకోకూడదూ?!"

"ఇంత చిన్న పనికి అంత విసుగెందుకురా? అవతల ఏం పెద్ద రాచకార్యాలు మునిగి పోతున్నాయని?" చిరాకు పడింది సుజాత.

"అమ్మా! గట్టిగా మాట్లాడకు. అవతల నా ఫ్రెండ్సున్నారు. వింటే బాగుండదు." ఫ్రిజ్‌లోంచి నీళ్ళసీసా తొందరగా పట్టుకెళ్తూ వెనక్కి తిరిగి అన్నాడు.

వాడి విసురుకి, నిర్లక్ష్యానికి 'ఇది' అని చెప్పలేని బాధ తన్నుకొచ్చింది ఆమె మనసు నుంచి. కోపంగా, నిస్సహాయంగా చూస్తూండిపోయింది.

"వెళ్లగానే ఉత్తరం రాయండి ఎన్ని పనులున్నా సరే." కళ్ళంట నీళ్ళొచ్చేస్తున్నాయి ఆమెకి.

"తప్పకుండా" తల దువ్వుకుంటూ అన్నాడు వెనక్కి తిరిగి చూసేసరికి సుజాత కళ్ళొత్తుకుంటూ కనిపించింది. అతని హృదయం కదిలిపోయింది. ఆమెను దగ్గరగా తీసుకుని గుండెకు హత్తుకున్నాడు.

"నేనేదో ఫారిన్ వెళ్ళిపోతున్నట్లు ఎందుకలా అయిపోతావు? నెలానెలా వస్తూనే ఉన్నానుగా!"

ఏదో చెప్పాలని తహతహ. పిల్లల గురించి చెప్తే... ఏమని చెప్తుంది? ఆయన ఉన్న ఒక్క రోజులోనూ పిల్లలమీద చెప్పడమేమిటి. ఛ. తను పిల్లల గురించి మరీ చాదస్తంగా ఆలోచిస్తోందేమో. తన మనస్సు మరీ సున్నితం. అంతే పాపం! వాళ్లు ఇంకా చిన్నవాళ్ళు. కాస్త పెద్దయితే బాధ్యత తెలిస్తే మంచీ - చెడూ, కష్టం - సుఖం ఇవన్నీ తెలుస్తాయి వాటంతటవే.

"అది కాదండీ! మిమ్మల్ని వదిలి నేను... ఒక్క నిముషం కూడా ఉండలేక పోతున్నాను..." గద్గద స్వరంతో అందామె.

"నేను మాత్రం నిన్నొదిలి ఉండగలనా చెప్పు! మరీ బేలగా ఆలోచించకు దేని గురించీ." ఆమె చేయి నొక్కి వదిలి పెట్టేడు రామారావు.

బేగ్ అందుకుని బయటకు నడిచేడు. వీధి అరుగు మెట్లమీద అడ్డంగా సురేష్, వాడి ఫ్రెండ్స్; రమేష్, వాడి ఫ్రెండ్స్ అంతా కూర్చునీ నిల్చునీ కలగాపులగంగా మాట్లాడేసుకుంటున్నారు.

"ఛ. ఎంత పని చేసే(రా మనవాళ్లు! కపిల్‌దేవ్, చేతన్‌శర్మ ఇద్దరూ ఔటయిపోయారు. ఈజీగా గెలుస్తారనుకున్న మేచ్ వాళ్ళకిచ్చేసారు. అస్సలు ఆస్ట్రేలియా ఓడిపోతుందనే అనుకున్నాను మొదట!"

"అది కాదురా. ఎంపైర్లు అలా చేస్తుంటే వాళ్ళు మాత్రం ఏంచేస్తారు?"

"ఈసారి వరల్డ్‌కప్ ఎవరి కొస్తుందో? మనవాళ్ళ కొస్తుందంటావా?"

"ఇంత చెత్త ఆటలు ఆడ్తుంటే ఎలా వస్తుంది?"

"అదిగో. అలా అంటేనే నాకు ఒళ్లు మండిపోతుంది. కపిల్‌దేవ్, గవాస్కర్‌లంటే ఏమిటనుకున్నావు? వాళ్ల గురించి నీకింకా తెలీదులా ఉంది. వాళ్లనేమీ అనడానికి వీల్లేదు. ఇదంతా ఆ ఎంపైర్ల తప్పే." ఆవేశంతో ఊగిపోతున్నాడు సురేష్.

"ఏం(టా! నీకు కపిల్‌దేవ్ అంటే అంత ఇదా?"

"ఇదా- అని ఇంకా మెల్లిగా అడుగుతున్నావు. హుఁ!"

"ఒరేయ్. సడన్‌గా కపిల్‌దేవ్ వచ్చి నీ ఎదురుగా నిలబడ్డాడనుకో. ఏం చేస్తావు?"

"వెంటనే అతని కాళ్లమీద సాష్టాంగ పడిపోతాను. కాలి ధూళి తీసి కళ్ళకద్దు కుంటాను. అతను అనుమతిస్తే అతని కాళ్ళు నా నెత్తిమీద పెట్టుకుంటాను."

"వాడికి పైత్యం బాగా ఎక్కువైందిరా. కాస్తనిమ్మకాయ పిండి..." పకపక నవ్వులు...!

"నోర్మూయ్‌బే. తెలీకుండా వాగకు."

సుజాత కొడుకుని రెండు, మూడుసార్లు గట్టిగా పిల్చింది. కాని వాడు కపిల్ లోకంలో ఉన్నాడు. కపిల్‌దేవ్ గురించి ఎన్ని యుగాలు మాట్లాడమన్నా విసుగూ, విరామం లేకుండా మాట్లాడతాడు సురేష్. అన్నింటికీ బెట్‌లు-ఛాలెంజ్‌లు. అక్కడున్న అందరూ అంతే. వాళ్ళంతా భావిభారత పౌరులు!

రామారావు మెట్లు దిగి రోడ్డుమీదకు వెళ్ళడానికి తోవ ఇవ్వాలని కూడా ఎవ్వరికీ అనిపించలేదు. ఇటు తిరిగి చూడలేదు. పిలిస్తే వినిపించుకోలేదు. ఇండియా ఓడిపోతున్నదనే బాధ వాళ్ళ నరనరాల్లో వ్యాపించి పుండులా నలుపుతోంది.

"సురేష్ కొంచెం తోవ ఇయ్యి. సూట్‌కేస్ రిక్షాలోపెట్టాలి." గట్టిగా అరిచింది. అప్పటికి కొంచెం పక్కకి జరిగేడు సురేష్.

రామారావు రిక్షాలో కూర్చుని చేయి ఊపాడు. సుజాత తిరిగి చేయి ఊపింది. రామారావు పిల్లలవైపు చూస్తూ చేయి ఊపుతున్నాడు ఎంతో ఉత్సాహంగా. సుజాత అటు చూసింది.

"నాన్నా! ఆ సూట్‌కేస్ ఇలా ఇవ్వండి. నేను రిక్షాలో పెడతాను."

"నాన్నా! నేను మీవెంట స్టేషనుదాకా వచ్చేదా?"

"నాన్నా! వెళ్ళిన వెంటనే ఉత్తరం రాయండి. లేకపోతే మాకు బెంగగా ఉంటుంది." లాంటి అభిమానంతో కూడిన మాటలు పిల్లల నోటివెంట వస్తాయేమోనని ఎదురు చూసిన ఆమెకు

తీరని ఆశాభంగం అయింది. వాళ్ళిద్దరూ చేయి ఊపడానికి అస్సలు ఇటువైపే చూడ్డంలేదు!! ఇంకా కపిల్‌దేవ్, గవాస్కర్ల దగ్గరే ఉన్నారు!

ఆమె మనసు చివుక్కుమంది. తండ్రి అంటే ఏమిటనుకుంటున్నారు వీళ్ళు! వీళ్ళమీదే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు ఆయన. ఈ పిల్లలకోసమే కదా తను, ఆయన ఇన్ని ఇబ్బందులు పడుతున్నది! అర్థం చేసుకోరేం వీళ్ళు! అలాంటి పిల్లల్ని కన్నందుకు తప్పు చేసినట్టు గిల్టీగా ఫీలవసాగింది ఆమె. ఆయన బాధపడ్డారో ఏమో? ఏమిటో అలాంటివేం అతను మనసులో పెట్టుకోరు! మేమున్నామంటూ కళ్ళంట నీళ్ళు తన్నుకొచ్చేసేయి సుజాతకి. కన్నీటి పొరల మధ్య రామారావు ఇంకా చేయి ఊపడం సుజాతకి మసకగా కనిపిస్తూనే ఉంది!!

★ ★ ★

*(ఆంధ్రప్రభ, వీక్లీ ; 20-5-1985)*